# పంచాయితీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

### గ్రామాలకు నేరుగా నిధులు ఇస్తేనే మార్పు సాధ్యం

హైదరాబాద్,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): పంచాయితీరాజ్ చట్టాన్ని బలోపేతం చేసేదిశగా మార్పులు చేస్తామంటున్న తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేలా చూడాలని పలువురు నిపుణులు చెబుతున్నారు. గ్రామాలకు ముఖ్యంగా సర్పంచ్‌లకు విధులు,నిధులు ఇస్తేనే ఇది సాధ్యమని అంటున్నారు. ఈ విషయంలో ఇటీవలే కాంగ్రెస్ ఆందోళన చేసింది. సర్పంచ్‌లకు నిధులు రాకదివాళా తీస్తున్నారని ఆందోళన చెందింది. గ్రామాలను యూనిట్గా చేసి కార్యక్రమాలను రూపొందించుకునే వెసలుబాటు సర్పంచ్‌లకు ఉండాలి. అప్పుడే పన్నుల వసూళ్లు మొదలు కార్యక్రమాల అమలు వరకు వారికి స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. పనులు చేయని సర్పంచ్‌లను చట్టబద్దంగా శిక్షించేలా చట్టం రూపొందించాలి. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామిలో పారిశుద్ధ్య పనులు చేర్చడంతో గ్రామ పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామాల పరిధిలో అన్నీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరిగేలా చట్టసవరణ జరగాలి. గ్రామాల్లో జరిగే ప్రతి పని పంచాయితీల ఆధ్వర్యంలో జరిగేలా, దాని పరిధిలోనే అధికారులు పనిచేసేలా చూడాలి. అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలపడడంతో పాటు కార్యక్రమాలు ముందుకు సాగుతా యంటున్నారు. గ్రామాలు స్వయం సమృద్ధి సాధిస్తాయి. ఇకపోతే పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీల ఏర్పాటుతో పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. పంచాయతీలకు వచ్చే నిధులు, ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుకోవాలన్న సర్కార్ నిర్ణయంతో గ్రామాల్లో పారిశుద్ద్యం వెల్లివిరియనుంది. ఈ పథకంలో ఇప్పటి వరకు చేస్తున్న పనుల్లో గ్రామీణ పారిశుధ్యాన్ని జోడించడం ద్వారా గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టబో తోంది. ఓ రకంగా ఇదో మంచినిర్ణయంగా దేశానికి ఆదర్శం కానుంది. ఇలా దేశవ్యాప్తంగా ముందడుగు పడే అవకాశాలు ఉన్నాయి. ఉపాధి హామీ పనుల్ని విస్తృతం చేయాలని, అందులో భాగంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను ఉపాధి కూలీలతో నిర్వహించాలని ఆ పథకం రాష్ట్ర మండలి నిర్ణయించింది. ఫలితంగా ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో మార్పు రానుంది. వాస్తవానికి పంచాయతీలకు లభించే సాధారణ నిధుల నుంచి 30 శాతం వరకు పారిశుద్ధ్యానికి ఖర్చు చేయాలనే నిబంధన గతంలో ఉండేది. తర్వాత దాన్ని 50 శాతానికి పెంచారు. అంటే పంచాయతీకి వస్తున్న ఆదాయంలో సగం పారిశుద్ధ్యానికే వెచ్చిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడంలేదు. అధికారులు తాజాగా తీసుకున్న నిర్ణయంతో పంచాయతీలు బలోపేతం కావడంతోపాటు వాటికి ఆర్థిక భారం కూడా తప్పుతుంది. కొత్తగా ఉపాధి కూలీలను పారిశుద్ధ్య పనుల్లోకి తీసుకుంటే గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త నిల్వలను తరలించే వీలుంటుంది. ఈక్రమంలో అధికారులు పారిశుద్ధ్య పనుల్లో ఉపాధి కూలీలను వినియోగించు కోవాలని నిర్ణయం తీసుకోవడం శుభసూచకం. ఈ నిర్ణయంతో అటు కూలీలకు పని దొరకడంతో పాటు పల్లెలు పరిశుభ్రంగా మారే అవకాశం ఉంది. గ్రామాల పరిధిలో కూలీలకు ఏం పని చూపించాలని భావిస్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం ఊరటనిస్తోంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనుల ద్వారా ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించ వచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారిశుద్ధ్య పనులు చేయించాలనే ఆలోచన మంచి నిర్ణయమని సర్పంచులు సైతం అంగీకరిస్తున్నారు. దీనివల్ల పల్లెలు పరిశుభ్రంగా మారతాయి. పంచాయతీలకు ఆర్థిక భారం తప్పుతుంది. గ్రామ పంచాయతీల్లో ఇదివరకే డంపింగ్ యార్డుల నిర్మాణ వనులను ఉపాధి కూలీలతో చేపడుతున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య పనులనూ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూలీలకు వంద రోజులు సమృద్ధిగా పనులు కల్పించవచ్చని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. ఇంతకాలం వంద రోజుల పనులు చేపట్టని కూలీలకు ఏవిధంగా పని చూపించాలనే ఆలోచిస్తున్న ఉపాధి సిబ్బందికి అధికారుల నిర్ణయం పూరటనిస్తోంది. కూలీలకు పల్లెల్లోనే పారిశుద్ధ్య పనులు చూపించవచ్చు. అలాగే చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత, భూములు చదును చేయడం, నీటి తొట్లు, పొలాల్లో కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులతో ఉపాధి కూలీలకు వంద రోజుల పనులు కల్పించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

# కరోనా నేపథ్యంలో న్యూ ఇయర్ వేడుకలు నిషేధం

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సిపి సజ్జనార్

హైదరాబాద్,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): సైబరాబాద్ పరిధిలో న్యూఇయర్ వేడుకలపై నిషేధం విధించినట్లు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. డిసెంబర్ 31వ తేదీన ఈవెంట్స్, రిసార్ట్స్, అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీలలో నూతన సంవత్సర వేడుకలకు అనుమతి లేదని తేల్చిచెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పోలీసులకు ప్రజలందరూ సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు. అలాగే హోటళ్లు, పబ్బుల్లో కూడ న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి లేదన్నారు. కరోనా కారణంగా వీటిపై నిషేధం ఉందన్నారు. కరోనా నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలకు అనుమతి లేదని సైబరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి లేదని, పబ్స్, రిసార్ట్స్, హోటల్స్‌పై పటిష్ట నిఘా ఉంటుందని ఆయన తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి వేడుకలు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సజ్జనార్ సూచించారు డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నామని, ఎవరైనా రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# రజనీకాంత్‌కు అస్వస్థత..ఆస్పత్రిలో చేరిక



హైదరాబాద్,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హైబీపీతో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చేరినట్టు సమాచారం. రెండు రోజుల పాటు చికిత్స అవసరమని డాక్టర్లు సూచించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయనతో పాటు కుమార్తె ఐశ్వర్య ఆస్పత్రిలోనే ఉన్నారు. కరోనా పరీక్షలో ఆయనకు నెగిటివ్‌గా తేలింది. పూర్తి సమాచారం త్వరలో వెలువడనుంది. మరోవైపు ఆయన ఆరోగ్యంపై అభిమానలలో ఆందోళన నెలకొంది.

ఇదిలా ఉంటే, రజనీ హీరోగా నటిస్తున్న 'అన్నాత్తే' మూవీ నగరంలోని రామోజీ ఫిలిం సిటీలో జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే రెండు రోజుల క్రితం కరోనా కారణంగా షూటింగ్‌ను వాయిదా వేశారు. షూటింగ్‌లో పాల్గొంటున్న ప్రొడక్షన్ సభ్యుల్లో 8 మందికి కరోనా సోకడంతో షూటింగ్ నిలిపేశారు. శివ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ నెల 22న నిర్వహించిన పరీక్షలలోను రజనీకాంత్‌కు కరోనా నెగెటివ్ వచ్చిందని అపోలో ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. బీపీ అదుపులో లేకపోవడంతో ఆసుపత్రిలో చేరిన రజనీకాంత్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. బీపీ కంట్రోల్ కాగానే డిశ్చార్జ్ చేస్తాం అని వైద్యులు ప్రెస్ నోట్‌లో తెలిపారు. డిసెంబర్ 31న రజనీకాంత్ తన పార్టీ గుర్తు, జెండా, అజెండా ప్రకటించనున్న తరుణంలో ఆయన అనారోగ్యానికి గురి కావడం అందరిని ఆందోళనకు గురి చేస్తుంది.



నగరంలోని జిల్లెల్లగూడ వెంకటేశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా పూజలు నిర్వహించిన సిఎం సతీమణి శోభ, ఎమ్మెల్సీ కవిత

# మాపై దాడులు చేస్తే ప్రగతి భవన్‌పైనే దాడికి దిగుతాం

### చూస్తూ ఊరుకోవడానికి మేము టిఆర్ఎస్ కాదు
### జగిత్యాల ఘటనపై మండిపడ్డ బండి సంజయ్

జగిత్యాల,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): మా మీద దాడులు చేస్తే ఆ తర్వాత దాడి జరిగేది ప్రగతి భవన్‌పైనేనని కరీంనగర్ ఎంపీ, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్రంగా హెచ్చరించారు . తన పర్యటనను అడ్డుకోవడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. జగిత్యాలలో మీడియాతో మాట్లాడిన ఆయన.. తాజాగా స్థానికంగా జరిగిన ఘటనపై స్పందిస్తూ.. మా మీద దాడులు చేస్తే నెక్స్ట్ దాడి ప్రగతి భవన్ పైనే అని వ్యాఖ్యానించారు.. దాడులు చేస్తే చూస్తూ ఊరుకోవడానికి మాది టీఆర్ఎస్ పార్టీ కాదు.. బీజేపీ అంటూ ఎంఐఎం నేతలను ఉద్దేశించి హాట్ కామెంట్లు చేశారు. ఇక రైతుల కోసం శుక్రవారం ప్రధాని మోదీ 9 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ. 18 వేల కోట్లు కేంద్రం జమచేసారని అన్నారు. రైతులను అనుగుంగా నూతన వ్యవసాయ చట్టాలు తీసుకువస్తే కొందరు మూర్ఖులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డ ఆయన.. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు కనీస పెట్టుబడి పరిహారం రాలేదని ఆరోపించారు. రైతులు పండించిన పంటను స్వయంగా రైతే ధర నిర్ణయించుకునే విధంగా నూతన వ్యవసాయ చట్టాలు ఉన్నాయన్న ఆయన.. దేశంలో ఎక్కడైనా లాభం చూసుకొని అమ్మేలా నూతన చట్టం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యవసాయ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు బండి సంజయ్.. చట్టం తెచ్చి 6 నెలలు అయినప్పటికీ నువ్వు ఫామ్‌హౌస్‌లో పండుకుని ఇప్పుడు వ్యతిరేకిస్తున్నావు అంటూ ఎద్దేవా చేశారు. సన్నరకాలు పండించిన రైతులు బాధపడుతున్నారు.. కానీ, కేసీఆర్‌కు ఆ సోయిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర రైతులను సన్న రకాలు పండించాలని చెప్పిన ముఖ్యమంత్రి తన ఫామ్‌హౌస్‌లో మాత్రం దొడ్డు బియ్యాన్ని పండించారని విమర్శించారు.. ఇక, 120 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ జేబులో వేసుకున్నాడని ఆరోపించారు.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడుతుంటే కేసీఆర్ మాత్రం ఫామ్‌హౌస్‌లో జల్సాలు చేస్తున్నారని కామెంట్ చేసిన బండి.. నిరుద్యోగ యువకులకు 3 వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు.

# బండి సంజయ్ జగిత్యాల పర్యటన ఉద్రిక్తం

### సర్పంచ్‌లతో కలసి ఎమ్మెల్యే సంజయ్ నిరసన..అరెస్టులు

జగిత్యాల,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ పర్యటన ఉద్రిక్తంగా మారింది. జగిత్యాల జిల్లాలోని ధరూర్ బ్రిడ్జిపై బండి సంజయ్‌ను నియోజకవర్గ టీఆర్ఎస్ సర్పంచ్‌లు, టీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కేంద్రం ప్రభుత్వం నుండి వెంటనే గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ. 1024 కోట్లు విడుదల చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. తమ అధ్యక్షుడి పర్యటనను కావాలని అడ్డుకుంటున్న టీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌లను అరెస్టు చేయాలని బీజేపీ నేతలు పోటాపోటీ నినాదాలకు దిగారు. అయినా పోలీసులు చూస్తూ ఉండిపోవడంతో బీజేపీ నేతలు వాగ్వాదానికి దిగారు.

టిఆర్ఎస్ పార్టీ సర్పంచులకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మద్దతు తెలిపారు. నిరసనలు తెలియజేస్తున్న సర్పంచులతో కలిసి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా నిరసనలు తెలిపాడు. దీంతో నిరసనకారులతో పాటుగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులకు, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

# రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా వైకుంఠ ఏకాదశి

### ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తుల రాక
### జిల్లెల్లగూడ వెంకటేశ్వరాలయంలో సిఎం సతీమణి శోభ, కవిత పూజలు
### విజయలక్ష్మి ఆలయంలో స్పీకర్ పోచారం దర్శనం

హైదరాబాద్,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): రాష్ట్రవ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలోని ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వార దర్శనం కోసం ఆయా ఆలయాల్లో క్యూ కట్టారు. నగర శివార్లలో ఉన్న జిల్లెలగూడలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని సీఎం కేసీఆర్ సతీమణి శ్రీమతి శోభ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రి సబితా ఇంద్రారెడ్డి దర్శించు కున్నారు. వేకువజామున మత్స్య వేంకటేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 4 గంటలకు ఆలయానికి చేరుకున్న శ్రీమతి శోభ, కవితకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజానంతరం ఆలయ అర్చకులు వారికి ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న కవిత.. రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించానని చెప్పారు. శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎర్రగడ్డలోని విజయలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. సతీసమేతంగా ఆలయానికి చేరుకున్న స్పీకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన ముక్కోటి ఏకాదశి వేడుకల్లో మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారిని మంత్రి కొప్పుల ఈశ్వర్ దర్శించుకున్నారు. ఉదయం ధర్మపురిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవాతి రాథోడ్.. ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్, బంధుమిత్రులతో కలిసి భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆ స్వామిని దర్శించుకోవడం మహద్భాగ్యమని, భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి చల్లని చూపులు ఈ రాష్ట్రం మీద ఎప్పటికీ ఉండాలని, అందరూ సుఖ, సంతోషాలతో ఉండేలా ఆశీర్వదించాలని కోరుకున్నట్లు తెలిపారు

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రజల సహకారంతోనే పచ్చదనం సాధ్యం
### గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌పై పాటను ఆవిష్కరించిన మంత్రి

హైదరాబాద్,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా, ప్రేమగా ఉండాల్సిన తరుణం ఆసన్నమైందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌పై తయారు చేసిన పాటను పద్మశ్రీ వనజీవి రామయ్యతో కలిసి అరణ్య భవన్‌లో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రపంచ మానవాళి ముందు ఇప్పుడు ఉన్న అతిపెద్ద సవాల్ పర్యావరణ రక్షణేనని మంత్రి అన్నారు. రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారని పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమంతో తెలంగాణలో 4 శాతం పచ్చదనం పెరిగిందని వివరాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి చేపట్టిన తెలంగాణకు హరితహారం స్ఫూర్తితో ఎంపీ సంతోష్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను దేశ వ్యాప్త చేశారని ప్రశంసించారు. ఒక్కొక్కరు మూడు మొక్కలను నాటుతూ.. మరో ముగ్గురిని నాటాల్సిందిగా సవాల్ చేయటం, ఒక గొలుసు కట్టులాగా విస్తరిస్తోందని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ హరిత భారతాన్ని స్వప్నించాలని, ఆకు పచ్చని తెలంగాణ సాధనే ధ్యేయంగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. క్షీణిస్తున్న అడవులు ప్రాణాధారమైన ఆక్సిజన్ ను తగ్గిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షిస్తూ పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉందని వనజీవి రామయ్య అన్నారు . నిరంతర కృషి, పట్టుదలతోనే అడవులు, చెట్ల పెంపకం సాధ్యమౌతుందన్నారు. దేశపతి శ్రీనివాస్ రాసిన పాటను, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించి, నటించగా, పూర్ణ చందర్ దర్శకత్వం, శిరీష్ కొరియోగ్రఫీ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవ నిర్మాణ బాధ్యతలను నెరవేర్చారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ విశిష్టతను పాట రూపంలో తీసుకువచ్చి, మరింత మందికి దగ్గర చేసేందుకు కృషి చేసిన పాట రూపకర్తలను ఎంపీ సంతోష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ (సోషల్ పారెస్ట్రీ) ఆర్.యం, డోబ్రియల్, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, దర్శకుడు పూర్ణ చందర్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవ, ప్రతినిధి కిషోర్ గౌడ్, కొరియోగ్రఫర్ శిరీష్, ఎడిటర్ వంశీ, సంగీత దర్శకుడు బాజీ, తదితరులు పాల్గొన్నారు.

# కరోనా స్ట్రెయిన్‌పై ప్రభుత్వం అప్రమత్తం

### యూకె నుంచి వచ్చిన వారిని గుర్తించే పనిలో అధికారులు

హైదరాబాద్,డిసెంబర్24(ఆర్ఎన్ఎ): కరోనా స్ట్రెయిన్ ఇప్పుడు ప్రపంచ దేశాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. దేశంలో కూడా ఈ తరహా కేసుల సంఖ్య ఎక్కువ అవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ అప్రమత్తమైంది. కరోనా నిపుణుల కమిటీతో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ సమావేశం కానున్నారు. కరోనా రెండో దశను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నారు. కాగా, విదేశాల నుంచి వస్తున్నవారికి ఎయిర్‌పోర్టులోనే పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే యూకే నుంచి రాష్ట్రానికి వచ్చిన వారిని గుర్తించేపనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వారికి ఎక్కడిక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బ్రిటన్ నుంచి వచ్చినవారిలో 60 శాతం మందిని గుర్తించారు. కాగా, బ్రిటన్ నుంచి వచ్చినవారిలో ఇద్దరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. పాజిటివ్ శాంపిల్స్‌ను సీసీఎంబీకి పంపించారు. కొత్త స్ట్రెయినా కాదా అనే అంశాన్ని నిర్ధారించేందుకు పరీక్షలు చేయనున్నారు. ట్రేసింగ్, టెస్టింగ్, ట్రీట్మెంట్ పద్ధతిని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని డీఎంఈ రమేశ్ రెడ్డి అన్నారు. యూకే, ఇతర దేశాల నుంచి వచ్చినవారు కచ్చితంగా టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. అలాంటివారిలో ఎవరికైనా కరోనా పాజిటివ్ వస్తే.. సెకండ్ స్ట్రెయిన్ ఉంటే అలాంటివారి కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశామన్నారు.

# దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చందుర్తి జడ్పిటిసి నాగం కుమార్ అన్నారు, చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 27న ఆదివారం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జోగాపూర్ గ్రామంలో గొల్లకుర్మ కుల సంఘం ఆధ్వర్యంలో ఈ విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు యెగ్గె మల్లేశం తోపాటు, మాజీ జడ్పీ చైర్పర్సన్ తుల ఉమా, నాయకులు క్యామ మల్లేష్, బీర్ల అయిలయ్య తో పాటు పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు హాజరవుతారని, దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున గొల్లకుర్మలు తరలివచ్చే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాకల పర్శరాములు, ఎంపీటీసీ మ్యాకల గణేష్, కో ఆప్షన్ సభ్యులు కోరే పర్శరాములు, మాజీ సర్పంచ్ నాగం రాజ మల్లయ్య, నాయకులు నాగం ఐలయ్య, మ్యాకల కొమురయ్య, పెంటల బీరయ్య, నాగం శ్రీనివాస్ పులి సత్యం గౌడ్, తదితరులు పాల్గొన్నారు,

# బాగా చదివే విద్యార్థులకు గురుకులాల్లో అడ్మిషన్లు



మహబూబాబాద్, డిసెంబర్ 25 : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మహబూబాబాద్ లోని దైవకృప పిల్లల అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి, వారితో సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. కొవిడ్ సందర్భంలో కూడా ఆశ్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరఫున అన్ని సదుపాయాలు కల్పించి, అండగా నిలబడ్డామని చెప్పారు.

తన శాఖ కిందకే ఈ ఆశ్రమాలు వస్తాయని, కావున రాష్ట్రంలో ఉన్న అన్ని ఆశ్రమాల్లో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మా శాఖ తరఫున అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఆశ్రమంలో కూడా బాగా చదువుకునే విద్యార్థులు ఉంటే వారిని గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామని హామీనిచ్చారు. పాఠశాలకు వెళ్లలేని పిల్లలకు కూడా కావాల్సిన అన్ని విధాల సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ డిప్యూటీ చైర్మన్ ఫరీద్, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే శంకర్ నాయక్ సతీమణి సీతా మహాలక్ష్మి, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయండి: తులసిరెడ్డి

అమరావతి,డిసెంబర్24(ఆర్ఎన్ఎ): అగ్రవర్ణాల పేదలపై ప్రభుత్వం అలసత్వం వహిస్తోందంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ తులసిరెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రిగారూ....అగ్రవర్ణ పేదలపై మీకు ఎందుకు అలుసు?అంటూ ప్రశ్నించారు. 103వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 10? ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. తమరు చేసిన అన్యాయం వల్ల ఇప్పటికే అగ్రవర్ణాలకు చెందిన పేద యువతీ యువకులు, గ్రామ..వార్డు వాలంటీర్ ఉద్యోగులు, గ్రామ..వార్డు సచివాలయ ఉద్యోగులు 971 వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు నష్టపోయారని మండిపడ్డారు. అగ్రవర్ణ పేదల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు రాకముందే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో జారి చేయాలని డిమాండ్ చేశారు.

# పీఎం కిసాన్ సమ్మాన్ విధిపథకం గురించి ప్రధాని ప్రసంగాన్ని దూరదర్శన్లో వీక్షించిన బీజేపీ నాయకులు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25 (నేటినిజం ప్రతినిధి):మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినంపునస్కరించుకొని పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ రైతులతో నేరుగా దూరదర్శన్లో మాట్లాడిన కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ నాయకులు ఎర్రం మహేష్ అర్బన్ మండల అధ్యక్షుడు ఎర్రం నరసయ్య ఎంపీటీసీ గలిపెల్లి సువర్ణ స్వామి సింగిల్విండో డైరెక్టర్ గొనె భాస్కర్ వేములవాడ బీజేపీ అర్బన్ మండల్ ప్రధాన కార్యదర్శి కసర్ల అరుణ్ కుమార్ దళిత మోర్చాప్రెసిడెంట్ ఎరుగోక్కుల రమేష్ మండల్ వైస్ ప్రెసిడెంట్ తునికి నరసయ్య కార్యదర్శులు చల్ల నరసయ్య బొంగోని అభిలాశ్ ఓబీసీ ప్రెసిడెంట్ జక్కుల మధు గ్రామ శాఖ ప్రెసిడెంట్స్ నాగుల సురేష్ కప్పుల అంజన్న నాగుల పూర్ణచందు పార్వతి వేణు గౌడ్ చంద్రగిరి భూమన్న మరియు బీజేపీ నాయకులు కార్యకర్తలు దూరదర్శన్లో వీక్షించారు .

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 25 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలంలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి, చందుర్తి మండల కేంద్రం తో పాటు మూడపల్లి, బండపల్లి, ఎన్గల్, జోగాపూర్, మల్యాల తదితర గ్రామాల్లో క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు,మూడ పల్లి గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్, సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు, పాస్టర్ నరసింహారెడ్డి పాల్గొని క్రైస్తవులకు దుస్తుల పంపిణీ చేశారు, మల్యాల గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సెస్ డైరెక్టర్ అల్లాడి రమేష్ పాల్గొని కేక్ కట్ చేశారు,

# జియో టవర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయించిన రైతులు

చండీగఢ్, డిసెంబర్ 25 :: కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రైతులు పంజాబ్‌లోని మన్సాలో రిలయన్స్ జియో టవర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో టెలికం దిగ్గజం సేవలకు అంతరాయం కలిగించారు.

ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు అవతార్ సింగ్ మాట్లాడుతూ నల్ల చట్టాలను రద్దు చేసే వరకు విద్యుత్ సరఫరా చేసే వరకు జియో, రిలయన్స్‌లను బహిష్కరిస్తూనే ఉంటామన్నారు. అందరు దీనికి మద్దతు ఇస్తున్నామని, కార్పొరేట్ల ప్రయోజనానికే మోదీ ప్రభుత్వం ఈ చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. భారతీయ కిసాన్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు కేంద్రం కొత్త వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ రైతులు హర్యానాలో చాలా రహదారులపై టోల్ వసూళ్లను శుక్రవారం నిలిపివేయించారు.

వేకువ జాము నుంచి రాష్ట్రంలోని అనేక టోల్ పాయింట్ల వద్ద టోల్ వసూలు నిలిచిపోయాయి. చాలా చోట్ల రైతులు టోల్ ప్లాజాలను ఆధీనంలోకి తీసుకొని.. ప్రయాణికుల నుంచి ఫీజు వసూలు చేయడానికి సిబ్బందిని అనుమతించలేదు. దీంతో టోల్ ప్లాజా ఉద్యోగులు ఎలాంటి చార్జీ చెల్లించకుండా వాహనాలను ప్రయాణించడానికి అనుమతించారు. బీకేయూ ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు హర్యానాలో టోల్ బూత్‌లలో టోల్ వసూలు చేయనివొద్దని పిలుపు నిచ్చింది. కర్నాల్‌లోని బస్తారా ఎన్‌హెచ్ -44పెకర్నాల్ జింద్ హైవే, సిర్సా జిల్లాలోని దబ్వాలి, ఖుయాన్ మాల్కానా, రోహ్తక్ - పానిపట్ హైవేలోని మాక్రౌలి కలాన్ వద్ద రైతులు టోల్ వసూళ్లను నిలిపివేయించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com